ఆంధ్రజ్యోతి 27-08-2008

# ఇన్‌ఫ్రా ప్రాజెక్టులపై మరింత ఫోకస్

## ❂ నిర్మాణ దిగ్గజం ఎన్‌సిసి
## ❂ ఈ ఏడాది 5000కోట్ల టర్నోవర్
## ❂ వ్యాపార వృద్ధికి త్రిముఖ వ్యూహం



రంగరాజు, ఎండి, ఎన్‌సిసి

నిర్మాణ రంగంలో దేశంలోనే అతిపెద్ద సంస్థగా ఉన్న నాగార్జునా కన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్ (ఎన్‌సిసి) రానున్న కాలంలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టుల్లోకి పెద్ద ఎత్తున ప్రవేశించే సన్నాహాల్లో ఉంది. బివోటి ప్రతిపాదికన రహదారులు, రేవులు, ఎయిర్‌పోర్టు ప్రాజెక్టులు చేపట్టేందుకు సిద్ధం అవుతున్నది. అదే సమయంలో అంతర్జాతీయ మార్కెట్లలోకి కూడా భారీ ఎత్తున విస్తరించాలని యోచిస్తున్నది. విద్యుత్ ఉత్పత్తి రంగంలోనూ సామర్థ్యాన్ని విస్తరించుకునే సన్నాహాల్లో ఉంది. ప్రస్తుత వ్యాపారాల్లోనే వాల్యూచైన్‌లో పై స్థాయికి వెళ్లడం, వృద్ధిపథంలో ఉన్న ఆకర్షణీయమైన కొత్త వ్యాపారాల్లోకి మళ్లడం, అంతర్జాతీయ మౌలిక వసతుల ప్రాజెక్టుల్లో బలంగా వేళ్లూనుకోవడం.... ఎన్‌సిసి భవిష్యత్ వృద్ధికి ఈ త్రిముఖ వ్యూహాన్ని అనుసరించనున్నట్టుగా సంస్థ ఎండి ఎవివి రంగరాజు అంటున్నారు. పెరిగిన వడ్డీ రేట్లు, ముడి సరుకుల ధరల కారణంగా ఇన్‌ఫ్రా రంగంలో కంపెనీల మార్జిన్లు తగ్గడం, బివోటి ప్రాజెక్టుల విషయంలో ఈ కంపెనీలు ఆచితూచి అడుగు వేస్తుండగా ఎన్‌సిసి మాత్రం ఈ విభాగంలో దూకుడుగా ముందుకు పోవడానికి నిర్ణయించడం విశేషం. కంపెనీ ప్రస్తుత పరిస్థితి, భవిష్యత్ పథకాలపై ఆంధ్రజ్యోతి బిజినెస్ బ్యూరో ఇంటర్వ్యూలో రంగరాజు వెల్లడించిన విశేషాలు.

ఎన్‌సిసి ప్రధాన వ్యాపారం నిర్మాణం. భవిష్యత్‌లో కూడా ఇదే ప్రధాన వ్యాపారంగా ఉంటుంది. అయితే అనుబంధ కంపెనీ ఎన్‌సిసి ఇన్‌ఫ్రా కార్యకలాపాలను భారీగా విస్తరించాలన్నది మా ఆలోచన. ఎన్‌సిసి ఇన్‌ఫ్రా ఈక్విటీ ప్రస్తుతం 200 కోట్ల రూపాయలు ఉండగా వచ్చే 18 నెలల్లో ఎన్‌సిసి ఇన్‌ఫ్రా వివిధ ప్రాజెక్టుల్లో (ఎస్‌పివి)చేసే ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్ మొత్తాన్ని 500 కోట్ల రూపాయలకు పెంచుతాం. ఆ తర్వాత వచ్చే కొద్ది సంవత్సరాల్లో ఈ మొత్తం 3000 కోట్ల రూపాయల వరకు హెచ్చిస్తాం. ప్రస్తుతం ఇన్‌ఫ్రాలో కేవలం పది ప్రాజెక్టులు మాత్రమే ఉన్నాయి. ప్రాజెక్టుల సంఖ్య రెట్టింపయ్యే అవకాశం ఉంది. బివోటి, యాన్యుటి ప్రాతిపదికపై రోడ్ ప్రాజెక్టులు, పోర్టులు, ఎయిర్‌పోర్టు ప్రాజెక్టులకు బిడ్ చేస్తాం. కర్ణాటక రాష్ట్రంలో షిమోగా, గుల్బర్గాలో రెండు ఎయిర్‌పోర్టు ప్రాజెక్టులను 100 కోట్ల రూపాయల ఇన్వెస్ట్‌మెంట్‌తో చేపడుతున్నాం. డెవలప్‌మెంట్ ఒప్పందాలపై సంతకాలు అయ్యాయి. టోల్ బేస్డ్‌గా 750 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన బెంగళూర్ ఎలివేటెడ్ ఎక్స్‌ప్రెస్ హైవే వచ్చే మార్చికల్లా పూర్తయ్యే అవకాశం ఉంది. ఇన్‌ఫ్రాలో భాగంగానే విద్యుత్ ప్రాజెక్టుల్లోకి కూడా పెద్ద ఎత్తున ప్రవేశించే ఆలోచన ఉంది.ప్రస్తుతం హిమాచల్ ప్రదేశ్‌లో 600 కోట్ల రూపాయల వ్యయంతో 100 మెగావాట్ల జల విద్యుత్ ప్రాజెక్టును, సిక్కింలో 1500 కోట్ల రూపాయల వ్యయంతో 280 మెగావాట్ల మరో జల విద్యుత్ ప్రాజెక్టును చేపడుతున్నాం. హిమాచల్ ప్రాజెక్టు ఫైనాన్షియల్ క్లోజర్ పూర్తయింది. 2011 కల్లా ప్రాజెక్టు పూర్తవుతుంది.

థర్మల్ విద్యుత్, ప్రాజెక్టుల బిడ్డింగ్‌లో పాల్గొనడంతో పాటు ముడి ఇంధనం లభ్యతను బట్టి మర్చెంట్ పవర్ ప్రాజెక్టుల్లోకి వెళ్లే యోచన కూడా ఉంది. పోర్టుల విషయానికి వస్తే మేటాస్‌తో చేపట్టిన మచిలీపట్నం రేవు ప్రాజెక్టులో ఈక్విటీ కింద మేం 100 కోట్ల రూపాయల వరకు ఇన్వెస్ట్ చేస్తున్నాం. ఈ పోర్టు ప్రాజెక్టు ఫైనాన్షియల్ క్లోజర్ ఈ ఏడాది ఆఖరులోగా ఉంటుంది. దేశంలోని మిగతా ప్రాంతాల్లో కూడా పోర్టుల్లో అవకాశాలను పరిశీలిస్తున్నాం. ఇన్‌ఫ్రా ప్రాజెక్టులకు సంబంధించిన ఇపిసి కాంట్రాక్టులు ఎన్‌సిసికే లభించే అవకాశం ఉంటుంది కనుక ఆ రకంగానూ మాకు లాభదాయకమే.

### అర్బన్ ఇన్‌ఫ్రాలోనూ బుల్లిష్..

ఎన్‌సిసి అర్బన్ ఇన్‌ఫ్రా ప్రధానంగా రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్‌లో ఉంది. ప్రస్తుతం రియల్టీ రంగం కొంత నెమ్మదిగా ఉన్నప్పటికీ మళ్లీ పుంజుకుంటుంది. ఎన్‌సిసి అర్బన్ ల్యాండ్ బ్యాంక్ 540 ఎకరాలపైనే ఉంది. హైదరాబాద్‌తో పాటు బెంగళూర్, చెన్నై, గోవా, వైజాగ్‌లో ప్రాజెక్టులు చేపట్టాం. హైదరాబాద్ తెల్లాపూర్‌లో 400 ఎకరాల్లో చేపడుతున్న ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్, టెక్నోపార్క్, ఐటిసెజ్ ప్రాజెక్టు మొత్తం 8 ఏళ్లలో పూర్తవుతుంది. తొలిదశ 167 ఎకరాల్లో చేపడుతున్నాం. ప్రాజెక్టు మొత్తం పూర్తయితే సేల్‌వాల్యూ 16 వేల కోట్ల రూపాయల వరకు ఉంటుందని అంచనా. ఇక్కడ మొత్తం 3 కోట్ల చదరపు అడుగుల స్థలాన్ని డెవలప్ చేస్తాం. జూబ్లీ హిల్స్‌లో మేటాస్‌తో కలిసి డెవలప్ చేస్తున్న ప్రాపర్టీ మొత్తం 9 లక్షల చదరపు అడుగుల వరకు ఉంటుంది. స్టార్ హోటల్, లగ్జరీ మాల్, రెసిడెన్షియల్ కాలనీ ఏర్పాటు చేస్తాం. గచ్చిబౌలిలో 12 ఎకరాల్లో, మంచిరేవుల దగ్గర దాయిష్ బ్యాంకు ఫండింగ్‌తో 37 ఎకరాల్లో మరో రియల్టీ ప్రాజెక్టు చేపట్టాం. వైజాగ్‌లో మధురవాడలో 100 ఎకరాల్లో వుడాతో కలిసి టౌన్‌షిప్ ప్రాజెక్టును డెవలప్ చేస్తున్నాం. ఈ ప్రాజెక్టు కూడా పూర్తయితే సేల్ వాల్యూ 2500 కోట్ల రూపాయల వరకు ఉంటుందని అంచనా. రాంచిలో నేషనల్ గేమ్స్ కోసం నిర్మిస్తున్న స్పోర్ట్స్ విలేజ్‌లో ప్రభుత్వం వాటా 12 శాతం పోను డెవలప్ చేసిన స్పేస్‌లో 88 శాతం వాటాను మేం గేమ్స్ తర్వాత విక్రయిస్తాం.

### ఈ ఏడాది 30 శాతం వృద్ధి..

ఈ ఏడాది టర్నోవర్‌లో 30 శాతం వృద్ధిని ఆశిస్తున్నాం. గ్రూప్ టర్నోవర్ 5000 కోట్ల రూపాయలను చేరే అవకాశం ఉంది. సంస్థ బ్యాక్ లాగ్ ఆర్డర్ బుక్ విలువ 12500 కోట్ల రూపాయలు ఉంటుంది. వచ్చే రెండున్నర ఏళ్లలో వీటిని పూర్తి చేస్తాం. బ్యాక్ లాగ్ ఆర్డర్ బుక్‌లో 25 శాతం వాటా నిర్మాణ విభాగానిదే. మరో 18–20 శాతం నీటి ప్రాజెక్టులది, 17–18 శాతం రహదారుల వాటా ఉంది. అంతర్జాతీయ బిజినెస్ వాటా టర్నోవర్‌లో 10 శాతం ఉన్నప్పటికీ బ్యాక్ లాగ్ ఆర్డర్ బుక్‌లోఈ వాటా 24 శాతం వరకు ఉంటుంది. అబుదాబిలో విల్లాల నిర్మాణం చేపట్టాం. మస్కట్‌లో రహదారుల ప్రాజెక్టు కూడా వచ్చింది. గల్ఫ్‌లోనూ, ఆఫ్రికాలోనూ కొత్తప్రాజెక్టుల్లో అవకాశాలపై దృష్టి సారిస్తున్నాం. ఆయిల్ అండ్ గ్యాస్, మెటల్, పవర్ సెక్టార్లలోకి కూడా కంపెని అడుగుపెడుతున్నది. మాకున్న సామర్థ్యాన్ని లివరేజ్ తీసుకుని కొత్త రంగాల్లోకి అడుగుపెడుతున్నాం. ఉక్రెయిన్ కంపెనీతో కలిసి మధ్యప్రదేశ్ బీనాలో 1000 కోట్ల రూపాయల భారత్ ఒమన్ రిఫైనరీ ప్రాజెక్టును చేపడుతున్నాం. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ 350 కోట్ల రూపాయలతో చేపట్టిన పానిపట్ రిఫైనరీ విస్తరణ ప్రాజెక్టు కూడా ఎన్‌సిసి దక్కించుకున్నది. పెరిగిన ముడి సరుకుల వ్యయం. వడ్డీ రేట్ల కారణంగా మార్జిన్లపై వత్తిడి పెరిగిన మాట నిజమే. అయితే పరిశ్రమ సగటుకు దగ్గరగానే మా మార్జిన్స్ ఉన్నాయి. డెట్ ఈక్విటీ రేషియో పూర్తి కంఫర్టబుల్‌గా ఉన్నందున పెద్ద ప్రాజెక్టులు వస్తే మరింత లీవరేజ్‌కు మాకు అవకాశాలు ఉన్నాయి.